# సాక్షి జగిత్యాల

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024






## నృసింహుడి నిధులు వెనక్కి..

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామికి గతంలో కేటాయించిన నిధులు వెనక్కి వెళ్లాయి. ప్రస్తుతం రూ.7.52 కోట్లతో మాత్రమే పనులు కొనసాగుతున్నాయి. -8లో▸



## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం అన్నారు. -8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/24.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం.. మరికొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

# అమ్మో.. న్యూడ్ కాల్స్

- ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేకు షాకిచ్చిన మహిళ
- నగ్నంగా వీడియో కాల్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు
- వీఐపీలు, మహిళలే టార్గెట్‌గా సైబర్ అరాచకాలు
- యూపీ, రాజస్థాన్, కాంబోడియా నుంచి ఆపరేట్
- ఏఐ సాంకేతికతతో చాటింగ్, వీడియో కాల్స్
- అపరిచిత కాల్స్ లిఫ్ట్ చేయొద్దంటున్న పోలీసులు

**ఉమ్మడి జిల్లాలో కేసుల వివరాలు**

| | |
|---|---|
| రామగుండం కమిషనరేట్ | 179 |
| కరీంనగర్ కమిషనరేట్ | 62 |
| రాజన్నసిరిసిల్ల | 58 |
| జగిత్యాల | 74 |



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేను వీడియో కాల్ కంగారు పెట్టించింది. హైదరాబాద్ వరకు పరుగులు తీయించింది. అసలేం జరిగిందంటే.. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని నంబర్ నుంచి ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేకు వీడియో కాల్ వచ్చింది. తన నియోజకవర్గం వారే అయి ఉంటారని ఆయన లిఫ్ట్ చేశారు. అంతే.. అవతలివైపు ఓ మహిళ నగ్నంగా ఉండి, మాట్లాడటం మొదలుపెట్టింది. ఒకటి రెండు సెకండ్లపాటు ఎమ్మెల్యేకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. వెంటనే, అప్రమత్తమై సదరు కాల్ డిస్‌కనెక్ట్ చేశారు. మరునాడు ఉదయం హుటాహుటిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు, నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌తోపాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీ సీఎస్‌బీ)కు కూడా ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో ప్రత్యర్థులతో తనకు కొనసాగుతున్న రాజకీయ పోరు నేపథ్యంలో ఈ పని చేయించింది వారేనని ఆయన అనుమానిస్తున్నారు. పోలీసులు మాత్రం ఈ కాల్స్ వెనక ఎలాంటి రాజకీయ కుట్ర లేదని భావిస్తున్నట్లు సమాచారం. ఇది ప్రొఫెషనల్ సైబర్ నేరగాళ్ల చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఎమ్మెల్యేకు వీడియో కాల్ వచ్చిన నంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. సదరు వీడియో కాల్ యూపీ నుంచి వచ్చినట్లు తెలిసింది.

### లిఫ్ట్ చేస్తే ఏమవుతుంది?

కరోనా తర్వాత సెల్‌ఫోన్, డేటా వినియోగం పెరిగింది. దీన్ని ఆసరాగా తీసుకొని, వీఐపీలు, డాక్టర్లు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, యువతులు లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు చెలరేగుతున్నారు. అందమైన అమ్మాయిల డీపీలు పెట్టి, వాట్సాప్‌లో తొలుత చాటింగ్ చేసి, తర్వాత వీడియో కాల్స్ చేస్తున్నారు. వాటిని రికార్డ్ చేసి, అనంతరం డబ్బులివ్వాలని బ్లాక్ మెయిలింగ్‌కు దిగుతున్నారు. ఇందుకోసం రాత్రి సమయాన్ని ఎంచుకుంటున్నారు. ఆ సమయంలో మద్యం సేవించి ఉంటారు కాబట్టి సులువుగా తప్పు చేస్తారన్నది వీరి వ్యూహంగా తెలుస్తోంది.

### నేరగాళ్లకు సమాచారం ఇచ్చేది మీరే..

ఎక్కడో యూపీ, నోయిడా, కాంబోడియా, థాయ్‌లాండ్ దేశాల్లో కూర్చొని, నేరాలకు పాల్పడేవారికి మీ డేటా ఎలా వెళ్లిందనేగా మీ అనుమానం? వారికి ఆ డేటా అందజేసేది మీరే.. ప్రతీ చిన్న వ్యవహారాన్ని ఫొటోలు తీసి, పెడుతుంటారు. మీ ఫోన్ నంబర్, కుటుంబసభ్యుల వివరాలు, పెళ్లిరోజు, పుట్టిన రోజు తదితరాలన్నీ.. మీ ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా ఖాతాల ద్వారా తెలుసుకుంటారు. అందుకే, వీలైనంత వరకు ప్రైవసీ ఉండేలా సెట్టింగ్స్ మార్చుకోండి.

### మాట్లాడేది మని'షి' కాదు..

వాస్తవానికి ఇలాంటి ఘటనల్లో నగ్నంగా కనిపించేది, మాట్లాడేది యువతులు, మహిళలు కాదు.. అసలు మనిషే కాదు. అదంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో సృష్టించిన సాఫ్ట్‌వేర్. ఇది నేరగాళ్లు చెప్పినట్లే నడుచుకుంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ చాటింగ్‌కు, వీడియో కాల్స్‌కు ఎలా స్పందించాలో ముందే అల్గారిథమ్‌లో పొందుపరుస్తారు. అలా ఎదుటివారికి ఎలాంటి అనుమానం రాదు. ఇది తెలియక అవతలవైపు నిజంగా.. మనిషే ఉందన్న భ్రమలో చాలామంది వారు చెప్పినట్లు చేసి, కష్టాలు కొనితెచ్చుకుంటారు.

### కాల్ వస్తే ఏం చేయాలి?

అపరిచిత వీడియో కాల్స్ వస్తే.. ఫ్రంట్ కెమెరాపై చూపుడు వేలు పెట్టి, లిఫ్ట్ చేయాలి. అవతలివైపు ఉన్నది మీకు తెలిసినవారు అయితేనే.. కాల్ కొనసాగించాలి. అనుమానాస్పద వ్యక్తులు అని అనుమానం వస్తే.. వెంటనే కట్ చేయాలి. వాస్తవానికి మీరేం చేయకపోయినా వీడియో కాల్స్ మాట్లాడితే చాలు.. మీ ఫేస్‌ను క్యాప్చర్ చేసి, డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా తిరిగి మీకే పంపి, డబ్బులు డిమాండ్ చేస్తారు.


### అవగాహన కల్పిస్తున్నాం



ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్లు ఉంటారు. ఎన్ని రకాల నేరాలు జరుగుతున్నాయో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఏమరుపాటుగా ఉండి, చాలామంది బ్లాక్ మెయిల్‌కు గురై, లక్షల్లో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి నేరాలు జరిగిన వెంటనే నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్(1930) లేదా సమీపంలోని సైబర్ క్రైం సెల్‌లో ఫిర్యాదు చేయాలి.

– వెంకటరమణ, ఏసీపీ, రామగుండం

# పట్టించుకుంటే.. పర్యాటకమే



ఎలగందుల ఖిల్లా

చరిత్ర గతించినా.. నాటి చారిత్రక వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు కట్టడాలు. ఎలగందుల ఖిల్లా, రామునిగుండాల, కోటిలింగాల, ఎల్లంపల్లి ప్రాజెక్టు, కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం, రాయికల్ చెన్నకేశవనాథ స్వామి ఆలయం, అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు, మధ్యమానేరులోని దత్తాత్రేయస్వామి ఆలయం.. ఇలా ఎన్నో ఉన్నాయి. నిర్మాణం, చరిత్రలో వేటికవే ప్రత్యేకం. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా.. అవి అభివృద్ధికి నోచుకోవడం లేదు. అరకొర నిధుల విడుదలతో అసంపూర్తి నిర్మాణాలు, అసౌకర్యాలు, రవాణా సదుపాయం లేకపోవడం వంటివే పర్యాటకులు, భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. పాలకులు పట్టించుకొని, సౌకర్యాలు కల్పిస్తే ప్రతీ ప్రాంతం పర్యాటకంగా విరాజిల్లుతుంది. పర్యాటకుల తాకిడి పెరిగి, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. – వివరాలు 8లో..

రాయికల్ చెన్నకేశవనాథ త్రికూటాలయం



## న్యూస్‌రీల్

### ఘనంగా భరణి నక్షత్ర వేడుకలు



యమధర్మరాజుకు ప్రత్యేక పూజలు

**ధర్మపురి:** భరణి నక్షత్రం సందర్భంగా ధర్మపురిలోని యమధర్మరాజు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణలతో స్వామివారికి రుద్రాభి షేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం నిర్వహించారు. ఆయుష్ హోమం హారతి, మంత్రపుష్పం నిర్వహించారు.

### నృసింహుడి సన్నిధిలో ఆర్‌జేసీ పూజలు



నృసింహుడి సన్నిధిలో రామకృష్ణారావు

**ధర్మపురి:** ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని శనివారం దేవాదాయ, ధర్మాదాయ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో శ్రీనివాస్, అర్చకులు ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ ఉన్నారు.

### ఆయిల్ పాం సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న రంగనాయకులు

**జగిత్యాలఅగ్రికల్చర్:** ఆయిల్‌పాం సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఆయిల్ పాం సాంకేతిక సలహాదారు వైఎస్.రంగనాయకులు అన్నారు. జిల్లాకేంద్రంలో ఉద్యానశాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పాం సాగుపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పాం సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. ఆయిల్ పాం గింజల టన్ను ధర రూ.17,049 ఉందని, ముందుముందు మరింత పెరిగి రైతులకు కలిసి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా ఉద్యానశాఖాధికారి దేవప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పాం సాగుకు రైతులు ఎక్కువ సంఖ్యలో ముందుకొస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ సీఈవో సిద్ధాంత్, ఉద్యాన అధికారి స్వాతి, హెచ్‌ఈవో అన్వేష్, రైతులు పాల్గొన్నారు.

### బాలవైజ్ఞానిక, ఇన్‌స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన

**జగిత్యాల:** వచ్చేనెల చివరివారంలో జిల్లాస్థాయి బాలవైజ్ఞానిక, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలు ఉంటాయని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల జిల్లాస్థాయి ఎగ్జిబిషన్, ప్రాజెక్ట్ కాంపిటీషన్ నిర్వహిస్తామని, అందరూ పాల్గొనాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయి బాలవైజ్ఞానిక ప్రదర్శనలో 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని, ప్రధాన అంశం సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ, ఉప అంశాలు ఉంటాయని, వాటికి సిద్ధం కావాలని, 2023–24కు గాను మొత్తం 60 ఇన్‌స్పైర్ అవార్డులు మంజూరు చేశామని, వీరందరి ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ అయ్యాయని, వీరు మాత్రమే ఇన్‌స్పైర్ అవార్డుల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులను సంసిద్ధం చేసి అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ 94402 12333లో సంప్రదించాలని కోరారు.

### వ్యాక్సిన్ నిల్వ చేసుకోవాలి

**జగిత్యాల:** చిన్నారులకు సరిపడా వ్యాక్సిన్ నిలువలు డ్రగ్స్ స్టోర్‌లో అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో సమియొద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డ్రగ్‌స్టోర్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రగ్‌స్టోర్‌లో రిఫ్రిజిరేటర్లు పనిచేస్తున్నాయా లేదా సిబ్బందిని అడిగారు. స్టాక్ రిజిస్టర్ మెయింటెన్ చేయాలని, మూడునెలల బఫర్ స్టాక్‌ను ఉంచాలని ఫార్మాసిస్ట్‌లకు ఆదేశించారు. మందులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాస్, ఫార్మసిస్ట్‌లు గిరిధర్, జంశద్‌అలీ, భూమేశ్వర్, శంకర్ పాల్గొన్నారు.

# హిందుధర్మాన్ని కాపాడుకోవాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**రాయికల్:** హిందుధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత హిందువులందరిదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్‌తోపాటు, సింగరావుపేట ఆంజనేయస్వామి, కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయానికి టీటీడీ ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధులతో భజన మందిరాలకు శనివారం భూమిపూజ చేశారు. ఆలయాల్లో భజన, ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పెరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్లు రాజలింగం, ఏనుగు మల్లారెడ్డి, నాయకులు రవీందర్‌రావు, కోల శ్రీనివాస్, పడిగెల రవీందర్‌రెడ్డి, రాంచందర్‌రావు, రాజేశం, శ్రీనివాస్, ప్రవీణ్, నరేశ్, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మ, ఏవో విక్రమ్ పాల్గొన్నారు.



కొత్తపేట నాగాలయంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

**ఎమ్మెల్యేకు సన్మానం**

మండలంలోని చెర్లకొండాపూర్ నుంచి మైతాపూర్ వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.86 కోట్లు మంజూరు చేయించినందుకు చెర్లకొండాపూర్ నాయకులు సాయిరెడ్డి, దేవుని రవి, ఆకుల గంగారెడ్డి, చిన్న నర్సయ్య, నరేశ్, నాగరాజు, భూపతి, హరీశ్ తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు.

**కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ**

**జగిత్యాల:** జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు. వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం పాల్గొన్నారు.

# కులగణనకు కసరత్తు

- మార్గదర్శకాలు రాగానే ప్రారంభం
- ఎన్యుమరేటర్ల నియామకానికి కసరత్తు
- రెండునెలల్లో నివేదికకు ఆదేశం

**జగిత్యాల:** జిల్లాలో మరోసారి సామాజిక సమగ్ర సర్వేకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని ప్రతి ఇంటింటికీ తిరిగి అన్ని కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిగతులను అంచనా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. 2014లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో జిల్లాల వారీగా, కులాల వారీగా జనాభాను ప్రకటించలేదు. ప్రస్తుత సర్వేలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ వర్గాలు అన్ని తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. రెండు నెలల్లోనే ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కులగణన బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో కులగణనకు ఎన్ని బృందాలు అవసరముంటాయి..? ఏయే శాఖల నుంచి ఎన్యుమరేటర్లను సేకరించాలి..? అని చూస్తున్నారు. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్న వివరాలను పరిగణలోకి తీసుకుని బృందాలు, ఎన్యుమరేటర్లను నియమించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. 1500 జనాభాకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి 10 మంది ఎన్యుమరేటర్లను ఏర్పాటు చేసేలా అంచనా వేస్తున్నారు. జిల్లాలో 5 మున్సిపాలిటీలు, 382 గ్రామాలు ఉన్నాయి. అప్పటి జనాభా లెక్కల ప్రకారం 9,85,417 జనాభా ఉంది. ప్రస్తుతం 10 లక్షలకు పైగానే జనాభా ఉంటుందని అంచనా. జిల్లాలో సామాజిక సమగ్ర సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో ఆదేశాలు రానప్పటికీ అధికారులు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఆదేశాలతోపాటు, సంపూర్ణ మార్గదర్శకాలు అందగానే పూర్తిస్థాయిలో సర్వే ప్రారంభించనున్నారు. జిల్లాలో బీసీలే అధికంగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కులగణన చేపడతామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ కులగణన చేపట్టేందుకు అధికారులకు మౌఖిక ఆదేశాలు వచ్చినప్పటికీ పూర్తిస్థాయి మార్గదర్శకాలు రాగానే చేపట్టనున్నారు. కలెక్టరేట్‌లో ఏవో ఆధ్వర్యంలో ఇప్పటికే కులగణనకు సంబంధించి ప్లానింగ్ చేపడుతున్నారు.

### మార్గదర్శకాలు రాగానే..



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కులగణన పూర్తి చేస్తాం. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. సంపూర్ణ మార్గదర్శకాలు రాగానే వర్క్ మొదలవుతుంది. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అధికారులందరి సమన్వయంతో చేపడతాం.

– సత్యప్రసాద్, కలెక్టర్

# 'బోనస్'కు నిబంధనలివే..

**జగిత్యాలఅగ్రికల్చర్:** వానాకాలంలో సాగు చేసిన సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెల్సిందే. అయితే కొనుగోలుకు కొన్ని నిబంధనలు విధించింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల నేతృత్వంలో కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. సన్న ధాన్యం కొనే కేంద్రం వద్ద ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన వ్యవసాయ అధికారులతోపాటు ఏఈఓలను నియమించనున్నారు. వీరు ధాన్యాన్ని పరిశీలించి నిబంధనల మేరకు ఉన్నాయా..? లేవా..? తేల్చనున్నారు. గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. వీటి కోసం మైక్రో మీటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తేమ శాతం 17 మించొద్దు.



సన్నని వరి ధాన్యం పంట

**బోనస్ వర్తించే సన్న రకాలు**

బోనస్ వర్తించే 33 సన్నాలను ప్రభుత్వం ప్రకటించింది. వరంగల్ సాంబ, వరంగల్ సన్నాలు, జగిత్యాలమసూరి, సిద్ధి, కంపాసాగర్ వరి –1, సాంబ మసూరి, జగిత్యాల వరి– 3, జగిత్యాల వరి–2, పొలాస ప్రభ, వరంగల్ వరి–2, ఎంటీయూ–1271, రాజేంద్రనగర్ వరి–4, కూనారం వరి–1, జగిత్యాల సన్నాలు, కృష్ణ, మానేరు సోన, తెలంగాణ సోన, కూనారం వరి–2, జగిత్యాల సాంబ, కరీంనగర్ సాంబ, అంజన, సోమనాథ్, ఆర్‌ఎన్‌ఆర్–31479, కేపీఎస్–6251, జేజీఎల్–33124, నెల్లూరు మసూరి, ప్రత్యుమ్న, సుగంధ సాంబ, శోభిని, హెచ్‌ఎంటీ సోనా, మర్టేరు మసూరి, మార్టేరు సాంబ.

### రేపు అప్రెంటిషిప్ మేళా

- ఐటీఐ ప్రిన్సిపల్ రవీందర్

**జగిత్యాల:** ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, పోపా ట్రేడ్ పూర్తిచేసిన అభ్యర్థులకు జగిత్యాల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 21న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రవీందర్ తెలిపారు. ఎలక్ట్రికల్ మోటర్స్, ఫార్మా, ఎనర్జీ సొల్యూషన్స్, లింక్‌వెల్ టెలి సిస్టం, ఎంటర్‌ప్రైజెస్ వంటి వివిధ కంపెనీలు వస్తున్నాయని, ఆసక్తి గలవారు WWW.APPRENTICEITI INDIA.GOV.IN నందు రిజిస్టర్ చేసుకుని సరైన ధ్రువపత్రాలతో జగి త్యాలలోని ఐటీఐలో హాజరు కావాలని తెలిపారు. మిగతా వివరాలకు ట్రెయినింగ్ ఆఫీసర్ రాజేశ్వర్‌రెడ్డిని 96185 93941 సంప్రదించాలని కోరారు.

### క్రీడలతో స్నేహభావం

- ఎస్పీ అశోక్‌కుమార్



విన్నర్ జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ

**జగిత్యాలక్రైం:** క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం పోలీసు ప్రధాన కార్యాలయంలోని మైదానంలో పోలీస్, జర్నలిస్టుల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. విన్నర్ పోలీస్ జట్టు, రన్నర్ ప్రెస్‌క్లబ్ సభ్యులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, సీఐలు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, రాంనర్సింహారెడ్డి, ఆరీఫ్ అలీఖాన్, ఎస్సైలు కిరణ్, సదాకర్, చిరంజీవి, నరేశ్, సతీశ్, శ్రీకాంత్, ప్రెస్‌క్లబ్ నాయకులు చీటి శ్రీనివాస్‌రావు, మహేశ్, మల్లారెడ్డి, సంపూర్ణాచారి, గోపాల్‌చారి, మదన్, రాజేశ్, హరి, శ్రీనివాస్, నరేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

- గడువులోపు సీఎంఆర్ అందించాలి
- కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి

**జగిత్యాల:** కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని, గడువులోపు సీఎంఆర్ అప్పగించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌పై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెండురోజుల్లో ప్రారంభించాలని, కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. సన్న ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన 63 కేంద్రాలకు ఏఈవోలు ట్యాగింగ్ చేయాలన్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ఈనెల 31లోపు అప్పగించాలని రైస్‌మిల్లర్లను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'రైతు భరోసా' కోసం బీఆర్‌ఎస్ ఆందోళన

- నేడు పార్టీ ఆధ్వర్యంలో నిరసన
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు



**జగిత్యాల:** రైతుభరోసా విడుదలపై కాంగ్రెస్ వైఖరి తెలపాలని, రైతులకు వెంటనే డబ్బులు జమ చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆదివారం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. వర్షాకాల రైతుభరోసా ఇప్పటివరకు ఇవ్వకపోవడం రైతులను ఇబ్బందులకు గురిచేయడమేనన్నారు. నిరసనలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొనాలని సూచించారు.

## క్లుప్తంగా

### మోసం చేసిన వ్యక్తుల అరెస్ట్

జగిత్యాలక్రైం: క్రిప్టో కరెన్సీ పేరుతో ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టించి ప్రజలను మోసం చేసిన గుమ్మిడాల నర్సయ్య, కోయాల్కార్ వేణు, ఆరె రాజేశ్, కురెల బాబు, కొట్టె మారుతితో పాటు మరికొంత మందిపై శనివారం కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వేణు గోపాల్ తెలిపారు. వివరాలు.. మల్టీలెవల్ మార్కెటింగ్ చేస్తూ క్రిప్టో కరెన్సీ వ్యాపారాన్ని జగిత్యాలలో ప్రారంభించారు. రిక్సోస్ ట్రేడ్ యాప్ ద్వారా యూఎస్‌డీటీ బీఈపీ20 అనే యాప్‌లో పెట్టుబడులు పెట్టించారు. యూఎస్ డాలర్ రూపంలో వస్తాయని ట్రస్ట్ వ్యాలెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే తామే బాధ్యత వహిస్తామని నమ్మించారు. పెట్టిన పెట్టుబడికి 18 నెలల్లో 5–10 రెట్లు వస్తాయని నమ్మించారు. ఈక్రమంలో కొద్ది రోజులుగా యాప్ మూసివేయడంతో పెట్టుబడులు పెట్టినవారు ఆందోళన చెందుతున్నారు. గుమ్మడి నర్సయ్య సామాన్య ప్రజల నుంచి యూఎస్‌డీటీ బీఈపీ20 ఖాతా తెరిపించి పెట్టుబడులు పెట్టించాడు. సుమారు 3 వేల డాలర్లు (రూ.2.50 లక్షలు) పెట్టుబడితో ఐదుగురిని చేర్పిస్తే రోజువారీ ఆదాయం వస్తుందని నమ్మించాడు. ఈక్రమంలో యాప్ మూసివేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### సేంద్రియ ఎరువులు తయారుచేయాలి


కంపోస్టుషెడ్స్‌ను పరిశీలిస్తున్న మసూద్

జగిత్యాల: వందశాతం సేంద్రియ ఎరువులు తయారుచేయాలని రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి మసూద్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని బయో మైనింగ్, కంపోస్టుషెడ్స్, యానిమల్ కేర్ సెంటర్‌ను పరిశీలించారు. యానిమల్ కేర్ సెంటర్ స్టోరేజీ కెపాసిటీ పెంచి వీలైనంత తొందరగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణ వంద శాతం చేసి సేంద్రియ ఎరువులను తయారుచేయాలని ఆదేశించారు. ముందుగా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సారంగాపూర్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం అన్నారు. ఉద్యమకారుల సంఘం చేపట్టిన పాదయాత్ర శనివారం బీర్‌పూర్‌కు చేరుకుంది. రాష్ట్ర ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకొచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేస్తామని చెప్పిందని, స్థానిక సంస్థల ఎన్నికల లోపు పార్టీ ప్రజలు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈనెల 15న ఆదిలాబాద్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఈనెల 29న ఆర్ట్స్ కళాశాల వరకు సాగుతుందని తెలిపారు. ఆయన వెంట ఉద్యమకారులు చల్ల లక్ష్మణ్, గర్షకుర్తి రమేశ్ తదితరులు ఉన్నారు.

# పట్టించుకుంటే.. పర్యాటకమే

- అభివృద్ధికి నోచుకోని, ఆదరణ కరువైన కట్టడాలెన్నో..
- పేరుగాంచిన ఆలయాల వద్ద సౌకర్యాలలేమి
- కొన్నిచోట్లకు రవాణా సౌకర్యమూ లేదు
- పర్యాటకులు, భక్తుల ఇబ్బందులు
- ప్రభుత్వం చొరవ చూపితే ఉమ్మడి జిల్లాకు పర్యాటక శోభ

## ‘ఎలగందుల’.. కళావిహీనమైన వేళ


చిరిగిపోయిన సౌండ్ అండ్ లైట్ షో స్క్రీన్

కొత్తపల్లి(కరీంనగర్): గత కాలపు చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఎలగందుల ఖిల్లా నిలుస్తోంది. కాకతీయులు, కుతుబ్‌షాహీల శిల్పకళా వైభవానికి ఇక్కడి కట్టడాలు ప్రతీక. ఈ ఖిల్లా 200 అడుగుల ఎత్తు, 2.5 మైళ్ల విస్తీర్ణంలో మానేరు నదిని ఆనుకొని, విస్తరించింది. కాకతీయులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, మొగులులు, అసఫ్‌జాహీలు ఈ కోట కేంద్రంగా పరిపాలన సాగించారు. బహుధాన్యపురంగా పిలవబడే నేటి ఎలగందుల నాడు చెన్నూరు, జగిత్యాల, జమ్మికుంట, లక్షెట్టిపేట, సిద్దిపేట, మహదేవపూర్, సిరిసిల్ల, సుల్తానాబాద్, కరీంనగర్ తాలుకాలతో జిల్లా కేంద్రంగా విరాజిల్లింది. ఖిల్లాలో నిర్మితమైన నీలకంఠ స్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు, మసీదు హిందూముస్లింల ఐక్యతకు చిహ్నంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వాలు అరకొర నిధులు కేటాయిస్తుండటంతో ఈ ఖిల్లా ప్రస్తుతం అభివృద్ధికి నోచుకోక, ఆదరణ కరువై కళావిహీనంగా మారింది. పర్యాటకులను ఆకర్షించేందుకు, ఎలగందుల గత వైభవాన్ని కళ్లకు కట్టినట్లు రూపొందించిన 40 నిమిషాల సినిమా ప్రదర్శించేందుకు రూ.3.13 కోట్లతో సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది మూలన పడింది. ఇక్కడికి రావాలనుకునేవారికి సరైన రవాణా సౌకర్యం లేదు. ఖిల్లా పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయింది. సర్కారు దృష్టిసారిస్తే పర్యాటకులతో సందడిగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ‘రామునిగుండాల’కు.. అటవీ భూములే అడ్డంకి


రామునిగుండాల

రామగుండం: పట్టణ పరిధిలోని రామునిగుండాలలో రామలక్ష్మణులు సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కొండపై 108 గుండాలున్నాయి. గుట్టపై 200 ఫీట్ల లోతు, 50 ఫీట్ల వెడల్పుతో ఓ లోయ ఉంది. లోయకు పైభాగాన ఉన్న బావిలో సీతాదేవి స్నానమాచరించిందని ప్రతీతి. రాముడు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు పాదముద్రికల స్థానంలో ఏర్పడిన గుంతలు గుండాలుగా మారి, రామగుండంగా పేరు వచ్చిందంటారు. ఈ గుండాలన్నింటిలో అన్ని కాలాల్లో నీరు సమృద్ధిగా ఉండటం విశేషం. లోయ మధ్యలో సొరంగ మార్గం ఉంది. దీన్ని యమకోణం అంటారు. ఇక్కడ నిత్యం నీరు ప్రవహిస్తుంటుంది. ఇందులో స్నానం చేస్తే యమలోక బాధలుండవని భక్తుల నమ్మకం. 2007లో మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇస్కాన్ సంస్థను సంప్రదించారు. రూ.200 కోట్లతో హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ మాదిరిగా దేవాలయం నిర్మించాలనుకున్నారు. కానీ, అటవీ భూములు అడ్డంకిగా మారడంతో ఇస్కాన్ సంస్థ విముఖత చూపింది. దీంతో పర్యాటకం మరుగున పడినట్లయింది. ప్రభుత్వంతోపాటు ఫారెస్టు అధికారులు సహకరిస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు. రామగుండాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


## అరకొర వసతుల నాంపల్లి గుట్ట


నాంపల్లి గుట్టపై కాళీయమర్దనం

వేములవాడ అర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన నాంపల్లి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. రాజన్నను దర్శించుకున్న చాలామంది ఇక్కడి స్వామివారికి పూజలు చేస్తారు. గుట్టపై పచ్చని చెట్ల మధ్య కాళీయమర్దనం ఆకట్టుకుంటుంది. గుట్ట పైనుంచి చూస్తే ఎడమవైపు వేములవాడ రాజన్న ఆలయం, మూలవాగు తీరం, కుడివైపు నిండుకుండను తలపించే మిడ్‌మానేరు ప్రాజెక్టు కనువిందు చేస్తాయి. ప్రభుత్వాలు మారినా లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏడాదికి కోటికి పైగా ఆదాయం వస్తున్నా అరకొర వసతుల మధ్య భక్తులు ఇబ్బంది పడుతున్నారు. చెట్ల కింద వంటలు చేసుకున్నా.. తినాలంటే కోతుల బెడద ఉందని అంటున్నారు. ప్రభుత్వం వసతులు కల్పించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు పంపించినా పనులు మాత్రం ప్రారంభించలేదు.

## నిలిచిన కోటిలింగాల-ఎల్లంపల్లి బోటింగ్


ఎల్లంపల్లి ప్రాజెక్టు


కోటిలింగాలలో నిరుపయోగంగా బోటు (ఫైల్)

రామగుండం: గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్ అభివృద్ధికి రూ.750 కోట్లు కేటాయించి, అందులో ఎల్లంపల్లి ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసి, బోటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెలటూర్ మండలంలోని కోటిలింగాల నుంచి ఎల్లంపల్లి వరకు(20 కిలోమీటర్లు) గోదావరి నీటిలో బోటింగ్‌ను ప్రారంభించారు. కానీ, సాంకేతిక కారణాలతో అది నిలిచిపోయింది. బోటింగ్ కోసం కొనుగోలు చేసిన పులోమావి బోట్–30 సీట్లు, శాతకర్ణి–50 సీట్లు, స్పీడ్ బోట్–5 సీట్లు కోటిలింగాల దేవాలయ ప్రాంగణంలోని గోదావరి నీటిలో పార్కింగ్ చేసి, ఉంటారు. బోట్లు నిరుపయోగంగా మారడంతో పర్యాటకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి, ఎల్లంపల్లి వద్ద ఉద్యానవనాలు, పూలు, పండ్ల తోటలు పెంపకానికి, స్నాక్స్ స్టాల్స్ ఏర్పాటు, తాగునీటి వసతి, గోదావరి అందాలను కూర్చొని తిలకించేందుకు ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటుకు కృషి చేస్తే పండుగలు, వీకెండ్, సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి పెరిగి, ఆదాయం సమకూరుతుందని పలువురు అంటున్నారు.

## మధ్యమానేరులో దత్తాత్రేయస్వామి


వరదవెల్లి దత్తాత్రేయస్వామి ఆలయం


బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో బోయినపల్లి మండలం వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలిశారు గురుదత్తాత్రేయస్వామి. ఇక్క డి ఆలయ పరిసరాల్లో పచ్చదనం పరుచుకుంది. గుట్టపై గ్రామస్తులు దత్త మందిరం నిర్మించారు. ఇక్కడ ఒకేసారి 300 జంటలు సామూహిక దత్తసత్య వ్రతాలు చేసే వీలుంది. 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ గుట్టపై ఏటా డిసెంబర్‌లో దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. చుట్టూ నీరే ఉండటంతో అక్కడికి వెళ్లడం కష్టం. ఉత్సవాల సమయంలో అధికారులు రెండు బోట్లు సమకూరుస్తారు. బోట్లలో వెళ్లినవారు గుట్టపైకి చేరాలంటే 100 వరకు మెట్లు ఉన్నాయి. మిగతా రోజుల్లో భక్తులు వెళ్లాలనుకున్నా వెళ్లలేరు. వంతెన నిర్మించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. గతేడాది దత్త జయంతి ఉత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు బోటులో వచ్చి, స్వామివారికి పూజలు చేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు వంతెన నిర్మాణం కోసం సర్వే చేయాలని మిడ్‌మానేరు ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. సర్వే చేసి, డిజైన్ కోసం సీఈ సీడీవో కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

## ‘కొత్తగట్టు’లో.. అసంపూర్తి పనులు


మత్స్యగిరీంద్రస్వామి ఆలయం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. ఇక్కడి గుట్టపై మత్స్యగిరీంద్రస్వామివారు వెలిశారు. 2002కు ముందు బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు దర్శించుకునే వారు. గుట్టపైకి అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు పూర్తయి, వాహనాలు గుట్టపైకి వెళ్తున్నాయి. భక్తుల సహకారంతో ఆంజనేయస్వామి, పోచమ్మ ఆలయాలు నిర్మించారు. ప్రాకారం, కల్యాణం మండపం, రాజగోపురం నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. ఏటా బ్రహ్మోత్సవాకు రూ.10 లక్షలకు పైనే ఆదాయం వస్తోంది. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలకు ఈ దారిలో వెళ్లేవారు మత్స్యగిరీంద్ర స్వామివారిని దర్శించుకుంటున్నారు. కరీంనగర్ పట్టణం నుంచి 30 కి.మీ. దూరంలో ఉన్న విష్ణుమూర్తి అవతారమైన మత్స్యగిరీంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఏకైక దేవాలయం కావడం విశేషం. అసంపూర్తి పనులు పూర్తి చేసి, ఆలయాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటక శోభ సంతరించుకుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## అన్నపూర్ణ ప్రాజెక్టుకు అన్ని అర్హతలు


అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టుకు టూరిస్ట్ స్పాట్‌గా మార్చేందుకు అన్ని అర్హతలున్నాయి. ఈ జలాశయం నీటి సామర్థ్యం 3.5 టీఎంసీలు. దీని చుట్టూ కొండలున్నాయి. ప్రాజెక్టు పక్కనే ఉన్న పట్నంగుట్ట ఎంతో ప్రసిద్ధి. గుట్టపై రాజులు పరిపాలించిన ఆనవాళ్లు ఉన్నాయి. రాతి దర్వాజాలు, పెద్ద బావి, రెండు కుంటలు కూడా ఉన్నాయి. ఇక్కడి దోనిలో ఎండాకాలంలోనూ నీరు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. జలాశయం పక్కన 92 మీటర్ల లోతు, 56 మీటర్ల వైశాల్యం గల సర్జిపూల్ ఉంది. గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయానికి ప్రతీ బుధ, గురు, ఆదివారాల్లో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇక్కడ పర్యటించిన సందర్భంగా అనంతగిరి ప్రాజెక్టును టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

## త్రికూటాలయం.. నిధులు జాప్యం


చెన్నకేశవనాథ ఆలయంలో పంచముఖ లింగం

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని చెన్నకేశవనాథ త్రికూటాలయాన్ని కాకతీయ రాజుల కాలంలో నిర్మించారు. దేశంలోనే రెండో పంచముఖ లింగం ఇక్కడ ఉంది. ఈ ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. కానీ, నిధుల విడుదలలో తీవ్ర జాప్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేవలం రూ.30 లక్షలు విడుదలవడంతో ఆలయ ఆవరణలో కల్యాణ మండపం, షెడ్డు నిర్మాణం పూర్తయ్యాయి. సీసీరోడ్లు, కాంపౌండ్ వాల్, ఆఫీస్ రూంలు, బాత్‌రూం పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా నిధులు విడుదలయ్యేందుకు, నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ చూపాలని ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి కోరుతున్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని, పర్యాటకంగానూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు తెలిపారు.

# నృసింహుడి నిధులు వెనక్కి..

- ఆలయ అభివృద్ధి ఆశలు అడియాసలు
- కేవలం రూ.7.52 కోట్లతోనే పనులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామికి గతంలో కేటాయించిన నిధులు వెనక్కి వెళ్లాయి. సుమారు రూ.62.69 కోట్లు వెనక్కి వెళ్లడంతో ఆలయ అభివృద్ధిపై భక్తుల ఆశలు అడియాసలయ్యాయి. ధర్మపురిని యాదాద్రి తరహాలో తీర్చిదిద్దుతామని ప్రకటించిన అప్పటి ప్రభుత్వం 2019 సెప్టెంబర్ 19న రూ.వంద కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. 2022 మార్చి నుంచి అక్టోబర్ వరకు స్వామివారి ఆలయంలో చేపట్టే వివిధ రకాల 22 పనులను రూ. 62.69 కోట్లతో చేసేందుకు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం రూ.7.52కోట్లతో మాత్రమే ఆరు పనులు కొనసాగుతున్నాయి. రూ.వంద కోట్లలో భూసేకరణ నిమిత్తం రూ.20 కోట్లు వెచ్చించాల్సి ఉంది. ఈ నిధులతోపాటు రూ.35.17 కోట్లతో 15 పనులు చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఆ నిధులు కూడా ప్రస్తుతం వెనక్కి వెళ్లాయి. రూ.5కోట్లతో మంగలిగడ్డ సుందరీకరణ, రూ.5కోట్లతో శ్రీమఠం వారి స్థలంలో కల్యాణ మండపం, రూ.13కోట్లతో స్వామివారి ప్రధాన ఆలయం పునర్నిర్మాణం, రూ.2.50కోట్లతో ఉగ్ర నృసింహుడి ఆలయ పునర్నిర్మాణం, రూ.2.20 కోట్లతో రథాల నిర్మాణ పనులు ఉన్నాయి. ఈ పనులు చేపట్టకపోవడంతో ప్రభుత్వం నిధులను వెనక్కి తీసుకుందని ఆలయవర్గాలు తెలిపాయి. పరిస్థితి నెలకొంది.

**భక్తుల తాకిడి ఉన్నా..**

ధర్మపురి పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి నిత్యం ఎక్కువగా ఉంటుంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తుంటారు. భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా పేరున్న ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం చిన్న చూపుచూసింది. యాదాద్రి తరహాలో ఉంటుందని భావించినా ప్రస్తుతం నిధులు వెనక్కి వెళ్లడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందని భక్తులు అంటున్నారు. స్వామివారికి పూర్వ వైభవం కలేనని భావిస్తున్నారు.

## జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


నగలను సందర్శిస్తున్న చైర్‌పర్సన్, మహిళలు

జగిత్యాల: జగిత్యాల విరూపాక్షి గార్డెన్స్‌లో శనివారం జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మేళాను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి జూయెల్లరీ జిల్లా కేంద్రంలో దొరుకుతుందని.. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మూడురోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, తెలంగాణ రీజినల్ మేనేజర్ రతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# చెక్ డ్యాం నిర్మించినా అందని సాగు నీరు


గుల్లపేట శివారులో నిర్మించిన చెక్ డ్యాం


చెక్‌డ్యాంపై కోతకు గురై, ప్రవహిస్తున్న వాగు

- ఎక్కడికక్కడే కోతకు గురవుతున్న సాగు భూమి
- రూ.కోట్లు వెచ్చించినా నిరుపయోగమే
- ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్య ఫలితమంటున్న అన్నదాతలు
- నీటి ప్రవాహాన్ని అంచనా వేయకుండానే నిర్మాణం
- మరో రూ.కోటి వెచ్చిస్తేనే పంటలకు సాగునీరు అందే పరిస్థితి

జగిత్యాలఅగ్రికల్చర్: వరద నీరు వృథా పోకుండా.. ఎక్కడికక్కడే నీటిని నిల్వ చేసి, చుట్టు ప్రాంతాల్లో భూగర్భజలాలు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు చెక్‌డ్యాంలు నిర్మిస్తుంటాయి. ఇందుకు రూ.కోట్లు కూడా ఖర్చు పెడుతుంటాయి. అయితే చెక్ డ్యాం నిర్మాణ సమయంలో ఇంజినీర్లు సరైన ప్రణాళిక రూపొందించకపోవడంతో నిధులు వృథా అవుతున్నాయి. మరోవైపు వ్యవసాయ భూములు వరద నీటిలో కోతకు గురవుతున్నాయి. జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేటలో నిర్మించిన చెక్ డ్యాంతో భూములన్నీ కోతకు గురవుతున్నాయి.

**నాలుగైదు గ్రామాలకు వాగే ఆధారం**

జగిత్యాలరూరల్ మండలం గుల్లపేట మీదుగా పెద్ద వాగు ప్రవహిస్తుంటుంది. ఈ వాగులో ఓ వైపు కోనాపూర్, హైదర్‌పల్లి మీదుగా వచ్చే చిన్నవాగు, మరోవైపు పెంబట్ల మీదుగా వచ్చే మరో చిన్నవాగు కలుస్తుంటుంది. ఈ రెండు వాగుల నీటితో గుల్లపేట, అనంతారం మీదుగా పెద్దవాగు ప్రవహిస్తుంటుంది. ఈ వాగుపై ఆధారపడి నాలుగైదు గ్రామాల రైతులు వరి సాగు చేస్తుంటారు. వాగులో విద్యుత్ మోటార్లు పెట్టుకుని సాగునీరు అందిస్తుంటారు. ఇలా దాదాపు 200 విద్యుత్ మోటార్లు పెట్టుకుని పంటలను కాపాడుకుంటున్నారు. వర్షం నీరు వచ్చినప్పుడు మాత్రమే పంటలు పండే పరిస్థితి. వరదనీరు రాకుంటే పంటలు ఎండిపోయే దుస్థితి. సమస్యను రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా చెక్‌డ్యాంను మంజూరు చేశారు.

**మూడేళ్ల క్రితం చెక్ డ్యాం నిర్మాణం**

వాగు చుట్టుపక్కల గ్రామాల రైతులకు సాగునీటి ఇబ్బందులు రాకుండా, భూగర్భజలాలు పెరిగేలా గుల్లపేట శివారులో మూడేళ్ల క్రితం దాదాపు రూ.1.40 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించాలని అప్పటి ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు సాగు నీటి పారుదల శాఖ ఇంజినీర్లు ప్లాన్ రూపొందించారు. వాగులో వచే నీటి ప్రవాహాన్ని అంచనా వేయకుండా చెక్ డ్యాం నిర్మించడంతో నీరు చెక్‌డ్యాంలో ఆగని దుస్థితి నెలకొంది. గుల్లపేట వద్ద రెండు చిన్న వాగులు కలిసి.. పెద్దవాగుగా మారిన కొద్ది దూరంలోనే చెక్ డ్యాం నిర్మించడమే ఇందుకు కారణంగా మారింది. నీరు ఆగేందుకు కొంత ఎత్తులో చెక్ డ్యాం నిర్మించడంతో వాగులో నీటి ఒత్తిడి ఎక్కువై.. వరద నీరు కిందికి రాకుండా, సమీప రైతుల భూముల్లోంచి వెళ్తోంది. దీంతో రైతుల నాలుగైదు ఎకరాల భూమి కోతకు గురైంది. చెక్‌డ్యాం కట్టినా చుక్క నీరు ఆగడం లేదని రైతులు ఫిర్యాదు చేయడంతో రైతుల భూముల్లోకి వరద నీరు వెళ్లకుండా మరో రూ.20 నుంచి రూ.30 లక్షలు ఖర్చు చేసి కట్ట నిర్మించారు. ఆ కట్ట కూడా వర్షాలకు కొట్టుకుపోయి ఎప్పటి మాదిరిగానే రైతుల భూముల్లోంచి నీరు కిందకు వెళ్తోంది.

**సరిగా నిర్మిస్తే కిలోమీటర్ వరకు నీరు**

చెక్‌డ్యాం నిర్మాణం సరిగ్గా ఉంటే దాదాపు కిలోమీటర్ వరకు ఏడాది పొడవునా నీరు ఉండే అవకాశముంది. వానాకాలం, యాసంగి తేడా లేకుండా వాగుకు మోటార్లు పెట్టుకుని రెండు పంటలు పండించుకునే వెసలుబాటు ఉంటుంది. ఈ చెక్ డ్యాం ద్వారా 4 నుంచి 5వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. చెక్‌డ్యాం నిర్మాణాన్ని ఇంజినీర్లు సరిగ్గా చేయలేదని, రెండు చిన్నవాగులు కలిసి, పెద్దవాగుగా మారిన తర్వాత కనీసం 500 మీటర్ల దూరంలో చెక్‌డ్యాం నిర్మిస్తే నీటి ఒత్తిడి ఎక్కువగా ఉండేది కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

### రూ.కోటి అయితేనే ఉపయోగం



చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.2 కోట్లు పెట్టినా చుక్క నీరు లేదు. చెక్‌డ్యాంలోకి రావాల్సిన నీరు రైతుల భూముల్లో నుంచి వెళ్తోంది. ఐదారుగురు రైతుల నాలుగైదు ఎకరాల భూమి కోతకు గురైంది. మరో రూ.కోటి ఖర్చు పెడితేనే చెక్‌డ్యాం ఉపయోగంలోకి వస్తుంది.

– గుర్రాల తిరుపతి రెడ్డి, గుల్లపేట

### నీరు నిల్వ ఉండడం లేదు



మూడేళ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మిస్తే మూడు వర్షాకాలాల్లో చుక్క నీరు ఆగలేదు. ఇంజినీర్లు సరిగ్గా ప్లాన్ ఇవ్వలేదు. నీటి ప్రవాహం ఒత్తిడి తగ్గిన ప్రదేశంలో చెక్‌డ్యాం నిర్మిస్తే బాగుండేది. చెక్‌డ్యాంను వినియోగంలోకి తీసుకురావాలి.

– చింతకింది రాజు, గుల్లపేట